# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 30-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ షాంఘై సహకార సంస్థ 25వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు చైనాలోని టియాంజిన్ చేరుకున్నారు.
- ❖ దేశంలోని కీలక ప్రాంతాలకు రక్షణ కల్పించడమే 'సుదర్శన్ చక్ర మిషన్' లక్ష్యమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.
- ❖ భారత్-జపాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో వేగం పుంజుకుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ పరిశుభ్రత, పట్టణాభివృద్ధి పరస్పరం ముడిపడి ఉన్నాయని కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు.
- ❖ 2047 నాటికి బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కలలుగన్న సమ సమాజాన్ని తీసుకురావడానికి కృషి చేస్తున్నట్టు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు.

==============================

షాంఘై సహకార సంస్థ (SCO) 25వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈరోజు చైనాలోని టియాంజిన్ చేరుకున్నారు. రేపటి నుంచి రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో నరేంద్ర మోదీ, ఇతర ప్రపంచ నాయకులతో కలిసి కీలక చర్చల్లో పాల్గొంటారు. ప్రాంతీయ భద్రత, అనుసంధానం, సుస్థిర అభివృద్ధి, ప్రపంచ సహకారం వంటి అంశాలపై ప్రధానమంత్రి ఇతర నేతలతో కలిసి చర్చించనున్నారు. ఈ సదస్సులో ఎస్‌సీఓ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సాధించిన విజయాలను సమీక్షించడంతో పాటు, భవిష్యత్ కోసం పదేళ్ల అభివృద్ధి వ్యూహాన్ని కూడా ఆమోదించనున్నారు. చైనా ఐదవ సారి ఎస్‌సీఓ సదస్సుకు ఆతిథ్యం ఇస్తోంది. ఆ దేశ అధ్యక్షుడు జి జిన్‌పింగ్ అధ్యక్షతన జరిగే ఈ సదస్సుకు 20కి పైగా దేశాధినేతలు, 10 మంది అంతర్జాతీయ సంస్థల అధిపతులు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ సదస్సులో పాల్గొనే ప్రముఖులలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉన్నారు. ఈ సమావేశం ఎస్‌సీఓ చరిత్రలోనే అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ రంగంలో స్వావలంబన కేవలం ఒక ప్రత్యామ్నాయం కాదని, అది దేశ పురోగతికి ఆవశ్యకమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన రక్షణ సదస్సులో ఆయన మాట్లాడుతూ... భారతదేశం వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని కాపాడుకోగలదని అన్నారు. దేశీయంగా అభివృద్ధి చేసిన రక్షణ సామర్థ్యాలకు 'ఆపరేషన్ సిందూర్' ఒక గొప్ప ఉదాహరణ అని కొనియాడారు. భారత సైన్యం స్వదేశీ పరికరాలను ఉపయోగించి పాకిస్థాన్‌లోని లక్ష్యాలపై కచ్చితమైన దాడులు నిర్వహించిందని చెప్పారు. మన సైనికుల కఠోర శ్రమ, స్వదేశీ పరికరాలపై ఆధారపడటం వల్లనే ఈ ఆపరేషన్ సమర్థవంతంగా, నిర్ణయాత్మకంగా పూర్తయిందని ఆయన ఉద్ఘాటించారు. దేశంలోని కీలక ప్రాంతాలకు రక్షణ కల్పించడమే 'సుదర్శన్ చక్ర మిషన్' లక్ష్యమని కేంద్రమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అపరిశుభ్ర ప్రాంతాలను త్వరిత గతిన శుభ్రం చేయడానికి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కోరారు. 'స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0' పై ఈరోజు జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో దృశ్య మాధ్యమం ద్వారా కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరిశుభ్రత, పట్టణాభివృద్ధి రెండూ ఒకదానికొకటి పరస్పరం ముడిపడి ఉన్నాయన్నారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను కాలపరిమితితో కూడిన ప్రణాళికతో శుభ్రం చేయడానికి తమ మంత్రిత్వ శాఖ ఒక విధానాన్ని రూపొందించిందని మనోహర్ లాల్ తెలిపారు. ఈ విధానం ప్రకారం, రాష్ట్రాలు క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించి, కఠినమైన పర్యవేక్షణ చేపట్టాలని, స్వచ్ఛత యాప్ ద్వారా క్లీనింగ్ టార్గెట్ యూనిట్స్ (CTU) లను మ్యాపింగ్ చేయాలని, పౌరులను భాగస్వామ్యం చేయాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో మొట్టమొదటి టెంపర్డ్ గ్లాస్ తయారీ కర్మాగారాన్ని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎలక్ట్రానిక్స్ తయారీలో భారత్ గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా భారత్‌లో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి దాదాపు 6 రెట్లు పెరిగిందని వెల్లడించారు. మొబైల్స్, ల్యాప్‌టాప్‌లు, ఇతర పరికరాల విడిభాగాలు ఇప్పుడు దేశంలోనే తయారవుతున్నాయని మంత్రి తెలిపారు. ఈ కొత్త ప్లాంట్ ప్రారంభంతో దేశీయ ఉత్పత్తి సామర్థ్యం మరింత పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

(వాయిస్ 27 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, జపాన్ మధ్య వాణిజ్యం, సాంకేతికత, పర్యాటకం, భద్రత, సాంస్కృతిక సంబంధాలను పెంపొందించేందుకు 'రాష్ట్ర-ప్రిఫెక్చర్ భాగస్వామ్య కార్యక్రమం' దోహదపడుతుందని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 15వ భారత్-జపాన్ వార్షిక సదస్సు ను టోక్యోలో ప్రధానమంత్రి ఈ రోజు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. భారత్-జపాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంలో వేగం పుంజుకుందని పేర్కొన్నారు. ఇకపై కేవలం ఢిల్లీ, టోక్యోల మధ్య సంబంధాలకే పరిమితం కాకుండా, రాష్ట్రాలు-ప్రిఫెక్చర్ల మధ్య బంధాన్ని బలోపేతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. ఈ కొత్త కార్యక్రమాన్ని వినియోగించుకొని, తయారీ రంగం, సాంకేతికత, ఆవిష్కరణలు, రవాణా, మౌలిక సదుపాయాలు, స్టార్టప్‌ల రంగాల్లో భాగస్వామ్యాలను ఏర్పరచుకోవాలని జపాన్ ప్రిఫెక్చర్ల గవర్నర్లకు, భారత్ లోని రాష్ట్ర ప్రభుత్వాలకు  సూచించారు. భారతదేశ వృద్ధి ప్రయాణంలో పాలుపంచుకోవాలని గవర్నర్లను ఆహ్వానించారు. ఈ సమావేశం అనంతరం, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, జపాన్ ప్రధానమంత్రి షిగేరు ఇషిబాతో కలిసి

'షింకన్‌సెన్' బుల్లెట్ రైలులో మియాగి ప్రిఫెక్చర్‌లోని సెండాయ్ చేరుకున్నారు. అక్కడ ఇరువురు నేతలు.. సెమీకండక్టర్ల తయారీకి అవసరమైన పరికరాలను ఉత్పత్తి చేసే ప్రముఖ సంస్థ టోక్యో ఎలక్ట్రాన్ ఫ్యాక్టరీని సందర్శించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

'మేక్ఇన్ ఇండియా'తో ప్రపంచ వైద్య పరికరాల హబ్‌గా భారత్ అవతరించిందని కేంద్ర ఫార్మాస్యూటికల్స్ కార్యదర్శి అమిత్ అగర్వాల్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 17వ సీఐఐ గ్లోబల్ మెడ్‌టెక్ సమ్మిట్ లో ఆయన మాట్లాడుతూ... ప్రపంచ దేశాలు భారతదేశాన్ని కేవలం ఒక మార్కెట్‌గానే కాకుండా, ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలలో ఒక అగ్రగామి దేశంగా చూస్తున్నాయని అన్నారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని సాధించడానికి ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు ప్రభుత్వంతో కలిసి పని చేయాలని ఆయన కోరారు. దేశీయ డిమాండ్ పెరగడం, ప్రభుత్వ ప్రోత్సాహం వల్ల భారత్‌లో వైద్య పరికరాల రంగం రెండంకెల వృద్ధిని సాధిస్తోందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత నౌకాదళానికి చెందిన స్వదేశీ యుద్ధ నౌక "ఐఎన్ఎస్ కద్మత్" పాపువా న్యూగిని (పీఎన్‌జీ) చేరుకుంది. పీఎన్‌జీ 50వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఈ నౌక ఈరోజు పోర్ట్ మోరెస్బీకి చేరుకుంది. ఈ సందర్శన ద్వారా 'యాక్ట్ ఈస్ట్' విధానంలో భాగంగా పసిఫిక్ ద్వీప దేశాలతో భారత్ తన సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, సుస్థిరత, సమ్మిళితవృద్ధిని ప్రోత్సహించడానికి కట్టుబడి ఉందని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ)ల సంక్షేమం కోసం శాసనసభ కమిటీలను ఏర్పాటు చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సూచించారు. భువనేశ్వర్‌లో రెండు రోజుల పాటు జరిగిన 'పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీల చైర్ పర్సన్‌ల జాతీయ సదస్సు' ముగింపు సమావేశంలో ఆయన ఈ రోజు మాట్లాడారు. రాష్ట్రాల్లో ఇలాంటి కమిటీల ఏర్పాటు కోసం పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేయాలని సూచించారు.

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న నాలుగు నుంచి ఐదు రోజుల పాటు వాయువ్య భారతదేశంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. జమ్మూ, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =